వేగవంతంగా భూసేకరణ పనులు

- రైతుల సమ్మతితో చేపట్టాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష

వికారాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 5 : భూసేకరణ పనులు రైతుల సమ్మతితో వేగవంతంగా పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నేషనల్ హైవేతో పాటు వివిధ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోతున్న రైతుల సమ్మతితో త్వరితగతిన భూ సేకరణ అవార్డు పాస్ చేయాలనిసంబంధిత అధికారులను ఆదేశించారు. వివాదంలో ఉన్న భూములకు సంబంధించి నష్ట పరిహారం ఆయా కోర్టుల్లో డిపాజిట్ చేసి భూ సేకరణ ప్రాసెస్ పూర్తయ్యాక ఆయా ప్రాజెక్టుల పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఇంజినీర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మండల కార్యాలయాల భవనాల పరిశీలన

బొంరాస్‌పేట : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం దుద్యాల మండలంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సమీకృత మండల కార్యాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. రైతు వేదికలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు ఇస్తున్న కుట్టు శిక్షణను ఆయన పరిశీలించారు. శిక్షణ అనంతరం బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలని పలువురు మహిళలు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ రుణాల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దుద్యాల నుంచి నాచారం వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం గౌరారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న మాడల్ అంగన్‌వాడీ భవనం, కిచెన్, స్టోర్‌రూమ్, క్లాస్ రూమ్, ప్లే ఏరియాలను కలెక్టర్ పరిశీలించారు. పనులను పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట కడా అధికారి వెంకట్‌రెడ్డి, ఈఈ నాగేంద్రం తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- డీఎల్పీవో సంధ్యారాణి
- పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో సంధ్యారాణి

కులకచర్ల, మార్చి 5 : గ్రామాల్లో వేసవిలో ఎదురయ్యే అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్పీవో సంధ్యారాణి అన్నారు. బుధవారం కులకచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు స్థానికులకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించడానికి ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని సూచించారు. తాగునీటి ఎద్దడితో గ్రామీణులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల చివరి వరకు ఇంటి పనులు పూర్తి స్థాయిలో వంద శాతం వసూలు చేయాలని సూచించారు. జీపీడీపీ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళికలను తయారు చేసి గ్రామ పంచాయతీల్లో తీర్మాణాలు చేసి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్‌గౌడ్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీబీఏ, బీఏ, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీ ఏ బిజినెస్ అనలిటిక్స్ మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థిని తబితను బుధవారం రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ పరామర్శించారు.

- వికారాబాద్, మార్చి 5

ఓయూలో డాక్టరేట్ పొందిన కౌలు రైతు బిడ్డ

ఓయూ ప్రొఫెసర్లకు తాను పరిశోధన చేసిన గ్రంథాన్ని అందజేస్తున్న నాగరాజు

మంచాల, మార్చి 5: మండల పరిధిలోని నోముల గ్రామానికి చెందిన జాంగ్లళ్ల నాగరాజు ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ అవార్డును పొందారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కౌలు రైతు జాంగళ్ల శివయ్య, జయమ్మ దంపతుల మొదటి కుమారుడు నాగరాజు మ్యాథమెటిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ బాబు పర్యవేక్షణలో ఒక అంశంపై పరిశోధన చేసి, ఆ గ్రంథాన్ని ఓయూ ప్రొఫెసర్లకు అందజేయడంతో డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. నాగరాజు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మంచాల వివేకానంద స్కూల్‌లో చదువుకున్నారు. ఆరు నుంచి 10వరకు ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివారు. ఇంటర్ మీడియట్ ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలోని చిలుకూరులోని అడ్మిషన్స్ పొందారు. నగరంలోని నిజాం కళాశాలలో బీఎస్సీ చదువుతూ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ మ్యాథమెటిక్‌లో అడ్మిషన్ పొందాడు. ఎమ్మెస్సీ తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ కోసం సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ చేశారు. ఒక సాధారణ కౌలు రైతు కుటుంబంలో పుట్టిన నాగరాజు పీహెచ్‌డీలో డాక్టరేట్ సంపాదించినందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆడపడుచే ప్రాణం తీసింది

వీడిన శిరీష హత్య కేసు మిస్టరీ

మలక్‌పేట, మార్చి 5 : అనుమానాస్పద స్థితిలో మరణించిన శిరీషను ఆడపడుచే హత్య చేసిందని పోలీసులు నిర్ధారించారు. బుధవారం చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు, డీఐ భూపాల్‌గౌడ్, ఎస్ఐ రవిరాజ్‌లతో కలిసి సౌత్ ఈస్ట్‌జోన్ మలక్‌పేట డివిజన్ ఏసీపీ శ్యాంసుందర్ ఈ ఘటన వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా పరకాలకు చెందిన శిరీష (32) కు చిన్నతనం(ఐదేండ్ల వయస్సు)లోనే తల్లిదండ్రులు చనిపోవటంతో ఆమెను ఒక ప్రొఫెసర్ దత్తత తీసుకొని పెంచి పెద్దచేశారు. ఆ తర్వాత శిరీష వారి వద్ద నుంచి వెళ్లొచ్చి బయటనే ఉంటూ బీఎస్సీ నర్సింగ్ చేసింది. పదేళ్లుగా వివిధ ఆస్పత్రులలో నర్సుగా విధులు నిర్వర్తించింది. నాగర్‌కర్నూల్ జిల్లా సున్నిపెంట చెందిన వినయ్ ఓ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా అతడి సోదరి సరిత 2016లో ఒకే ఆస్పత్రిలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో సదరు ఆస్పత్రిలో నర్సుగా చేరిన శిరీషకు సరితతో సాన్నిహిత్యం పెరిగింది. ఈ క్రమంలోనే సరిత తన తమ్ముడికి నచ్చజెప్పి శిరీషను ఒప్పించి 2016లో(తొమ్మిదేండ్ల క్రితం) అన్నీ తానై ఇద్దరికి పెళ్లి జరిపించింది. ప్రస్తుతం వీరికి రెండేండ్ల కూతురు కూడా ఉంది. పెళ్లైన నాటి నుంచి వినయ్, శిరీష దంపతులు మలక్‌పేటలోని జమునా టవర్స్‌లో నివాసం ఉంటున్నారు. సరిత భర్త విదేశాల్లో ఉండడంతో ఆమె కూడా వీరిద్దరితోనే అదే ఇంట్లో నివాసం ఉంటున్నది. అయితే ఇటీవల నర్సుగా పని మానేసి ఇంటి వద్ద ఉంటున్న శిరీషను సరిత మందలించింది. పదే పదే ఉద్యోగం వదులుకోవడం తగదంటూ ఘర్షణ పడింది. ఇటీవల సరిత, శిరీషల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 2 శనివారం అర్ధరాత్రి 11.30 గంటలకు సరిత-శిరీషలు గొడవ పడి కొట్టుకున్నారు. శిరీషను సరిత తీవ్రంగా గాయపరిచింది. కాస్త సద్దుమణిగాక తనకు అస్వస్థతగా ఉందని శిరీష చెప్పగా సరిత తాను వాడుకునే మత్తుమందును అధిక మోతాదులో శిరీషకు ఇచ్చింది. దీంతో శిరీష మత్తులోకి జారుకుంది. ఇదే అదునుగా శిరీషకు ఊపిరి ఆడకుండా సరిత దిండు అదిమి ప్రాణం పోయేలా చేసింది. ఈ విషయాన్ని మరుసటి రోజు ఉదయం తమ్ముడు వినయ్‌కు చెప్పింది. ఇదంతా తెలుసుకున్న వినయ్ అక్కను కాపాడే ప్రయత్నంలో శిరీషకు గుండెపోటు వచ్చిందంటూ చెప్పి ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లి అది సహజ మరణమేనని నమ్మించాడు. అక్కడి నుంచి అంబులెన్స్ మాట్లాడి శిరీష మృతదేహాన్ని సున్నిపెంటకు తరలించే ప్రయత్నం చేశాడు. ఇంత హడావుడిగా అంబులెన్స్‌ను తీసుకెళ్లే ప్రయత్నంపై శిరీష మేనమామ మధుకర్‌కు అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి అంబులెన్స్‌ను వెనక్కి పిలిపించి పోస్టుమార్టం చేయిస్తే అసలు బండార మంతా బయటపడింది.

నేరాన్ని అంగీకరించి..

శిరీషకు ఊపిరాడకుండా చేసి చంపివేసి ఉంటారని పోస్టుమార్టం చేసిన వైద్యులు వెల్లడించడంతో వినయ్, సరితలను పోలీసులు విచారించారు. ఈ హత్యకు తానే పాల్పడినట్లు సరిత ఒప్పుకున్నదని పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసులో సరిత, వినయ్‌లతో పాటు భిట్టు అనే మరో నిందితుడిపై కూడా హత్యకు సంబంధించిన కసులు పెట్టారు. ఈ కేసులో మరింత లోతైన విచారణ చేస్తున్నామని ఏసీపీ శ్యాం సుందర్ చెప్పారు.

ఓపీ ముగిశాక వచ్చి.. షోకాజ్ నోటీసులా

హాస్పిటల్ వ్యవస్థలపై అవగాహన లేకుండానే హడావుడి
మంత్రి తీరుపై మండిపడుతున్న గాంధీ వైద్యసిబ్బంది

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తీరుపై గాంధీ వైద్యులు తీవ్రంగా మండిపడుతున్నారు. 'ఓపీ సమయం ముగిసిన తరువాత వచ్చి ఓపీలో ఎవరూ లేరని షోకాజ్ నోటీసులిస్తామంటే ఎలా...నిజంగా రోగుల అవస్థలు, ఓపీలో ఉన్న సమస్యలను తెలుసుకోవాలనుకుంటే మధ్యాహ్నం 12లోపు వస్తే అసలు విషయం తెలుస్తుంది. అందరూ వెళ్లిపోయిక ఆగమేఘాల మీద వచ్చి ఆగమాగం చేస్తే ఎలా' అని పలువురు వైద్యులు మంత్రి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం

మధ్యాహ్నం 1.15గంటల సమయంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గాంధీ దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన మొదట ఓపీ విభాగాన్ని సందర్శించి, అక్కడి విభాగాలన్నీ కలియతిరిగారు. అయితే అప్పటికే ఓపీ సమయం ముగియడంతో అక్కడ రోగులు పెద్దగా లేరు. వైద్యులు, ఇతర సిబ్బంది సైతం ఆయా విభాగాలకు, మరికొందరు భోజనానికి వెళ్లిపోయారు. దీంతో ఓపీ విభాగంలో ఎవరూ లేకపోవడమేంటని మంత్రి వైద్యులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదీ ఓపీ సమయం..

అధికారికంగా ఒంటి గంట వరకు ఓపీ పూర్తి చేసుకుని, ఒంటిగంట నుంచి మధ్యాహ్నం 2వరకు భోజన విరామం, ఆ తరువాత 2నుంచి మధ్యాహ్నం 4వరకు ప్రొఫెసర్ స్థాయి వైద్యాధికారులు అకాడమిక్‌కు అంటే వైద్యవిద్యార్థులకు బోధించేందుకు వెళ్తారు. ఇక అసిస్టెంట్, అసోసియేట్ తదితర స్థాయి వైద్యులు ఓపీలో అడ్మిషన్ పొందిన రోగులను చూడడానికి ఐపీ వార్డుల్లోకి వెళ్తారు. యూనిట్ల వారీగా ఆయా స్థాయి వైద్యులు తమ విభాగాలను చూసుకుంటారు. ఇది సాధారణంగా ప్రతిరోజు దవాఖానలో జరిగే కార్యకలాపాలు.

వాస్తవాలు తెలుసుకోరా..

ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఎంసీహెచ్ భవనంలోని ఐదోఅంతస్తులో ఉన్న ఐవీఎఫ్ కేంద్రాన్ని మంత్రి సందర్శించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడున్న రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసిన మంత్రి ఐవీఎఫ్ ఇన్‌చార్జ్ గురించి కూడా ఆరాతీశారు. ఆ సమయంలో సదరు వైద్యులు అక్కడ లేకపోవడంతో మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విషయాన్ని అక్కడి సిబ్బంది లేబర్ రూమ్‌లో ఉన్న సదరు వైద్యురాలికి సమాచారం ఇవ్వడంతో వెంటనే సదరు వైద్యురాలు లేబర్ రూమ్ నుంచి మంత్రి ఉన్న ఐదవ అంతస్తులోకి వచ్చేందుకు యత్నించగా అక్కడున్న లిఫ్ట్‌ను మంత్రి కోసం నిలిపివేశారు. దీంతో చేసేది లేక సదరు వైద్యురాలు మెట్ల మార్గంలో ఐదంతస్తులెక్కి వచ్చినా అప్పటికే తీవ్ర అసహనంతో ఉన్న మంత్రి సదరు వైద్యురాలు చెప్పేది వినకుండా, సీట్లో లేనందుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలంటూ అధికారులను ఆదేశించి వెళ్లిపోవడంతో అక్కడున్న వైద్యులు అవాక్కయ్యారు.. విధినిర్వహణలో ఉన్న వైద్యురాలు లేబర్ రూమ్‌లో ఉందని అటు అధికారులు, ఇటు వైద్యురాలు చెప్పేందుకు యత్నించినా మంత్రి వినిపించుకోకుండా షోకాజ్ నోటీసు ఇవ్వమనడంపై వైద్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సామర్థ్యానికి మించి పనిచేసేవారిపై వాస్తవాలు తెలుసుకోకుండా మండిపడిన మంత్రి తీరుపై వైద్యసిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

మ్యాప్ ద్వారా వివరాలను తెలుసుకుంటున్న డీపీవో జయసుధ

నవాబుపేట, మార్చి 5 : భూ క్రమబద్ధీకరణ పథకం ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలోని వెంచర్ల దరఖాస్తులను డీపీవో జయసుధ, ఎంపీడీవో అనురాధతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం డీపీవో మాదిరెడ్డిపల్లి సమీపంలోని వనభూమి వెంచర్ దరఖాస్తుల ప్రక్రియను సంబంధిత కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. పన్నులు, నీటి సరఫరా, అనుమతి తదితర అంశాలపై వారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో, కార్యదర్శులు ఉన్నారు.

టమాటలో నూతన హైబ్రిడ్ రకాలు అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ డా. రాజిరెడ్డి తదితరులు

వీసీ డా. రాజారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 5: టమాటకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందని, వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాలను మరిన్ని మార్కెట్‌లోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా. రాజిరెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన నాణ్యత నిచ్చే నూతన టమాట రకాల రూపకల్పనపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో వాతావరణ, పర్యావరణ మార్పులు, వైరస్ తెగుళ్లు,చీడపీడలను తట్టుకునే రకాలు, అధిక దిగుబడినిచ్చే, పరిశ్రమలకు అనుగుణంగా ఉండే ప్రాసెసింగ్ టమాట, హైబ్రీడ్ రకాలను రూపొందిస్తే ఎగుమతికి అవకాశాలు పెరుగుతాయన్నారు. వైరస్‌ను తెగుళ్లను, అధిక వేడిని తట్టుకునేందుకు అవసరమైన, జన్యులను ఆవిష్కరించి, టమాట రకాలలో జొప్పించామని, వాటిని త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా రైతులకు అందుబాటులో తీసుకువస్తామని, తైవాన్ దేశంలో అంతర్జాతీయ కూరగాయల పరిశోధనా కేంద్రం టమాట బ్రీడింగ్ సీనియర్ శాస్త్రవేత్త డా. ఆసఫ్ ఐబి సీజ్ అన్నారు. పరిశోధనా ఫలితాలు కాన్ఫరెన్స్ జనరల్ కార్యదర్శి, వర్సిటీ అసోసియేట్ ప్రొ. పిడిగం సైదయ్య, వర్సిటీ డీన్ డా. రాజశేఖర్, పరిశోధనా సంచాలకులు డా. లక్ష్మీనారాయణ, అంతర్జాతీయ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా. శ్రీనివాసన్ ఉద్యాన కళాశాల అసోషియేట్ డీన్ డా. పిప్రశాంత్, మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్, డా. పి.సైదయ్య, ప్రపంచ కూరగాయల కేంద్రం సైంటిఫిక్ అధికారి డా. వై. శ్రీనివాస్‌రెడ్డి, యూనివ్సిటీ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు,పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాలల రోస్టర్ పాయింట్‌ను మార్చాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాల యూత్ ఫెడరేషన్ చైర్మన్ మాందాల భాస్కర్, అనంతరం నాయకుల నినాదాలు

ఉస్మానియా యూనివర్సిటీ: అనైతికంగా జరిగిన ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వివిధ మాల సంఘాల నాయకులు స్పష్టం చేశారు. వర్గీకరణలో మాలల రోస్టర్ పాయింట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్గీకరణ అంశాలను చర్చించబోయే అవకాశం ఉందని అన్నారు. రెండు అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం పునఃపరిశీలన చేసి, మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. 1, 2, 3 గ్రూపులుగా చేసిన వర్గీకరణను మాల, మాల అనుబంధ కులాలుగా, మాదిగ, మాదిగ అనుబంధ కులాలుగా రెండే గ్రూపులుగా విభజించాలని డిమాండ్ చేశారు. మాలలకు కేటాయించిన 22వ రోస్టర్ పాయింట్‌ను పునఃపరిశీలించి మాలలకు ఏడో రోస్టర్ పాయింట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు మాల రోస్టర్ పాయింట్ కన్నా మూడు రోస్టర్ పాయింట్లు ముందుగా ఉన్నాయని చెప్పారు. సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా చేసుకొని పొందుపరచిన రిజర్వేషన్లలో ఆర్థిక పరమైన రిజర్వేషన్లు కల్పించిన ఈడబ్ల్యూఎస్ రోస్టర్ పాయింట్ల కంటే ఎక్కువ ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. మంత్రివర్గ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై సమీక్ష చేసి మాల, మాల అనుబంధ కులాలకు నష్టం జరగకుండా సవరణలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని అభిప్రాయపడ్డారు. లేనిపక్షంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, టీచర్స్ ఎమ్మెల్సీల ఎన్నికల్లో జరిగిన పరాభవమే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పునరావృతం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల యూత్ ఫెడరేషన్ చైర్మన్ మాందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ నేత మాదాసు రాహుల్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, విద్యార్థి నాయకులు పసరుగొండ కిషోర్, కొప్పుల అర్జున్, సింగి శ్రీకాంత్, ప్రవీణ్ కాంబ్లె, రవి, అంజిబాబు, గణేష్, శివకుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపడిన బీసీ వాదం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి,మార్చి5:టీచర్స్,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీవాదం బలపడిందని పలువురు బీసీ మేధావులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మేధావుల ఫోరమ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, బీసీ సంఘం నాయకులు వట్టి జానయ్య, పోకపోతుల నరేందర్‌గౌడ్, గుజ్జు సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్కం కోమరయ్య బీసీల మద్దతుతోనే గెలిచారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు వెన్నులో వణుకు పుట్టించామన్నారు. రోబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ నేతలను గెలిపించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.త్వరలోనే కరీంనగర్,వరంగల్‌ల్లో మేధోమదన సమావేశాలను ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కులచర్ల శ్రీనివాస్,నరసింహనాయక్, ఇతర బీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయుక్తం.. ఏఐ బోధన

పరిగి, మార్చి 5 : మండలంలోని గడిసింగాపూర్ పాఠశాలలో విద్యార్థులకు ఏఐ పాఠ్యాంశాలను సాంకేతికతతో కూడిన విద్యను అందించడాన్ని బెంగళూరుకు చెందిన ఈకేఎస్‌టీఈపీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సభ్యులు పర్యవేక్షించారు. బుధవారం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనంతి నాయకత్వంలోని బృందం సభ్యులు పాఠశాలను సందర్శించి ఏఐ బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నదన్నారు. అనంతరం డీఈవో రేణుకాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు ఏఐ పాఠ్యాంశాలను చక్కగా నేర్చుకొని సాంకేతికతతో కూడిన అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, ఏఎంవో రామ్‌మస్తాన్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా ఎంఎస్ఎంఈ క్యాంపు

ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ క్యాంపస్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైఫాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం మెగా ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంప్ జరిగింది. బ్యాంక్ ఆఫర్ చేస్తున్న ఎంఎస్ఎంఈ ప్రొడక్ట్స్‌పై అవగాహన కల్పించారు. 400 మంది వినియోగదారులు ఈ క్యాంపునకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 50మందికి పైగా లబ్ధిదారులకు సుమారు వంద కోట్ల విలువజేసే మంజూరు పత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇండస్ట్రీ సెంటర్ జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, ఎంఎస్ఎంఈ జనరల్ మేనేజర్ జీకే.సుధాకర్, ఆర్ఎల్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. **- సిటీబ్యూరో, మార్చి 5(నమస్తే తెలంగాణ)**

యూజీసీ నూతన నిబంధనల ముసాయిదా, డిటెన్షన్ విధానాలను వ్యతిరేకించండి

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కొండా నాగేశ్వరరావు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 5: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూజీసీ నూతన నిబంధనల ముసాయిదాను అందరూ వ్యతిరేకించాలని ఓయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. డి టెన్షన్ విధానాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని చెప్పారు. యూజీసీ నూతన నిబంధనలను వ్యతిరేకిస్తూ పీడీఎస్యూ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్లో సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యూజీసీ నూతన నిబంధనల ద్వారా యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి ద